క్లుప్తంగా

పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జేడీగా దామోదరరావు


దామోదరరావు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జేడీ(జాయింట్ డైరెక్టర్)గా ఎన్.దామోదరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఆ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇదివరకు ఇక్కడ జేడీగా పనిచేసిన వై.వి.రమణ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఈయనను ఇన్‌చార్జ్ జేడీగా నియమించారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వండి


సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దారు శ్రీకాంత్

నెల్లిమర్ల: అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందజేయాలని తహసీల్దారు శ్రీకాంత్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. పథకం మంజూరులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వాటిని సరిచేయాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ డబ్బులు అందేలా చూడాలన్నారు. సమావేశంలో రీసర్వే డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా దేవీమాధవి


ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు నాయుడు

విజయనగరం ఫోర్ట్: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన దేవీమాధవిని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు డాక్టర్ జేసీ నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ డీవీజీ శంకర రావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న సీఐ రవికుమార్

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపుపై ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా విక్రయిస్తున్న ఎనిమిది మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.రాధిక ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరవుతున్నారని, పూర్తిస్థాయి అభివృద్ధి నివేదికలతో అధికారులు రావాలని కోరారు.

కూటమిది కక్షపూరిత పాలన

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి


కొండకరకాం సభలో కూటమి దగాకోరు పాలనపై నిలదీస్తున్న ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల

విజయనగరం: ప్రజాసంక్షేమం గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన కొనసాగిస్తోందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండకరకాం గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో కూటమి దగాకోరు పాలనపై మండిపడ్డారు. అధికారం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలు కన్నా రెండింతలు ఎక్కువ ఇస్తానని నమ్మబలికి, తీరా గెలిచాక పథకాల అమలు విస్మరిస్తుండడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 14 నెలల కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎక్కడ చూసినా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై దాడులు, అక్రమ కేసులు తప్ప ఏం పరిపాలన చేశారని ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో ఎన్ని అమలు చేశారని నిలదీశారు. వైఎస్సార్ సీపీ పోరాడితేనే ఆ ఒకట్రెండు(గ్యాస్, తల్లికి వందనం) పథకాలైనా ప్రజలకు వచ్చాయన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాడకుంటే అవి కూడా ఎగ్గొట్టేందుకు చంద్రబాబు అండ్ కో ప్రయత్నించారని ధ్వజమెత్తారు. ఇటీవల ఆడబిడ్డ నిధి పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలే(ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలి) దీనికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడం జరిగిందని, ప్రతి వర్గానికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగిందన్నారు.


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

ప్రశ్నిస్తానన్న పవనెక్కడ?

ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రజాసమస్యలు, వారి బాగోగులు వదిలేసి కేవలం రాజకీయ కక్షల కోసం పాలన కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. పేదలకు ఇస్తానన్న ఇళ్లు, 50 ఏళ్లకే బీసీలకు ఇస్తానన్న పింఛన్, మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారన్నారు. కూటమి ఇచ్చిన హామీలకు తాను గ్యారెంటీ అని, సంతకం చేసి బాండ్‌లిచ్చిన పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని, హామీలు అమలు చేయని ప్రభుత్వాన్ని ప్రశ్నించలేరా అని నిలదీశారు. తనను బాగా నమ్మిన యువతకు పవన్ ఏం చేశారని, ఎంతమందికి ఉద్యోగాలిప్పించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డెక్కితే చాలు ప్రభుత్వం వణుకుతోందని, గొప్పగా పాలన చేస్తే ఎందుకంత వణుకన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, హామీలు అమలు చేసేదాకా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. సమావేశంలో సర్పంచ్ కెల్ల రాంబాబు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోలా మన్మధకుమార్, ఎంపీటీసీ భోగాపురపు ఆదినారాయణ, కార్పొరేటర్ బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని 24, 31, 39 డివిజన్లలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, పి.సూర్యనారాయణ, కార్పొరేటర్లు వై.లక్ష్మణరావు, వి.ప్రభాకరరెడ్డి, బి.లక్ష్మి, పి.రాధాభవాని తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సింహాచలం మేడను పునరుద్ధరించాలి


రాస్తారోకో చేస్తున్న విజయనగరం పట్టణ పౌరసంక్షేమ సంఘం సభ్యులు

విజయనగరం గంటస్తంభం: చారిత్రక కట్టడమైన సింహాచలం మేడను పునరుద్ధరించాలని విజయనగరం పట్టణ పౌరసంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ సంఘ సభ్యులతో కలిసి నగరంలోని సింహాచలం మేడ ప్రాంతంలో రాస్తారోకో శుక్రవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విజయనగరం చారిత్రక వారసత్వ సంపద రోజురోజుకూ కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన సింహాచలం మేడను కూల్చేశారని, పాత మహారాజా ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారు ఎత్తివేశారని, బొంకులదిబ్బ ఇప్పటికే అద్దెకు ఇచ్చేస్తున్నారన్నారు. మహారాజా కళాశాల, సంగీత కళాశాలను రక్షించుకోవాలన్నారు. దేవస్థానం ఆస్తి అయిన సంహాచలం మేడను కూల్చేసి ఏం చేస్తారో చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చారిత్రక సంపదను అమ్ముకోవడం చాలా దౌర్భాగ్యమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. కార్యకరమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ భారతి

డెంకాడ: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ బి.భారతి తెలిపారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో మండలంలోని సింగవరం, పినతాడివాడ గ్రామాల్లో రైతులకు పంటల సాగు–అధిక దిగుబడులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరినారు తీసే వారం రోజులు ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వేసుకోవాలన్నారు. వరి వెదలో కలుపుమొక్కల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ కె.లక్ష్మణ్ వివరించారు. పంటలకు నానో యూరియా, నానో డీఏపీని వినియోగించాలని సూచించారు. విత్తనాలు జల్లేముందు వాటిని శుద్ధి చేసుకుని వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి కె.గోవిందమ్మ, మండల వ్యవసాయాధికారిణి టి.సంగీత తెలిపారు. అలాగే ఈ నెల 15వ తేదీలోపు వరి పంట ఎకరాకు రూ.200 చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఏఈవో బి.రామకోటి, వ్యవసాయ సహాయకులు రాంబాబు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దు.. పాతమీటర్లే ముద్దు


ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు

విజయనగరం టౌన్: ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై పెనుభారం పడుతుందని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు రెడ్డి నారాయణరావు అన్నారు. నగర పరిధిలోని పూల్‌బాగ్ మంగళవీధిలో విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. స్మార్ట్‌మీటర్లు వద్దు.. పాతమీటర్లే ముద్దు అని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు మేలు చేకూర్చేలా కొత్త విద్యుత్ చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇవే స్మార్ట్‌మీటర్లు తెస్తే వద్దన్న వారే ఇప్పుడు బిగించమని ఆదేశాలివ్వడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయం మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలాపు అప్పలరాజురెడ్డి, బడుగు, బలహీన వర్గాల సంఘం నాయకులు చెన్నా ధర్మా, గుజ్జూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్


మాట్లాడుతున్న కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ శ్రీనివాసన్

విజయనగరం అర్బన్: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, ఆ దిశగా విద్యార్థులు తయారు కావాలని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ కోరారు. జిల్లా కేంద్రంలోని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో పీజీ విద్యార్థుల కోసం శుక్రవారం చేపట్టిన ఇండక్షన్ ప్రొగ్రాం..కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కేవలం డిగ్రీకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా సమగ్ర వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలన్నారు. వికసిత భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమన్నారు. యూనివర్సిటీ అందిస్తున్న వనరులు, అవకాశాలను అందిపుచ్చుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆత్మవిశ్వాసం, కృషి, నైతిక విలువలే విజయానికి బాటలు వేస్తాయన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా మాట్లాడుతూ వసతులు, పరిపాలన నిర్మాణం, కీలక అధికారుల విధులను వివరించారు. జాతీయ విద్యావిధానం 2020 ఆధారిత పాఠ్యప్రణాళికలు, పరీక్ష విధానాలపై డీన్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్, ట్రైబల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ అనిరుద్‌కుమార్, గ్రంథాలయాధికారి డాక్టర్ శంకర్‌రెడ్డి, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పోలీస్ వెల్ఫేర్ డే'


మహిళా పోలీస్ సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్.. పోలీస్ సిబ్బంది నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పోలీసుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

అప్పారావుకు బొత్స పరామర్శ


అప్పారావు బాగోగులు అడిగి తెలుసుకుంటున్న శాసనమండలి విపక్ష నేత బొత్స, పక్కనే ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పతివాడ అప్పారావును మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన అప్పారావు..విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, అక్కడే తన కుమారుడి ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొత్స సత్యనారాయణ..ఆయన వద్దకు వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం


భోగాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

భోగాపురం: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, అప్పుడే పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తప్పకుండా తల్లిపాలే ఇవ్వాలని వక్తలు సూచించారు. మండల కేంద్రంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ పచ్చిపాల నాగలక్ష్మి, ఐసీడీఎస్ పీవో సుజాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని, తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంట వ్యవధిలో తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. శిశువులకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తి అధికమవుతుందన్నారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం..


పూసపాటిరేగ: కొత్తకొప్పెర్ల2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి

పూసపాటిరేగ: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో అవసరమని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జి.శ్రీదేవి అన్నారు. మండలంలోని కొత్తకొప్పెర్ల–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో వయసుకు తగ్గ బరువు ఉంటుందని, అలాగే రోగ నిరోధక శక్తి కలిగి ఎటువంటి పరిస్థితినైనా తట్టుకోగలరన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా పిల్లలకు సమృద్ధిగా పాలివ్వాలంటే ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కొప్పెర్ల సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, వైస్ సర్పంచ్ లంకలపల్లి రాజారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఉమాదేవి, ఎం.కనకరత్నం, ఏఎన్ఎం తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు


కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు


కామాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: శ్రావణమాసం సందర్భంగా స్థానిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రాతఃకాలార్చన అనంతరం మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు కామాక్షి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయొద్దు


జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయవద్దని, అటువంటి విధానాలను విడనాడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జరుగుతున్న తొమ్మిదో జాతీయ మహాసభల సందర్భంగా స్థానిక జిల్లా కమిటీ కార్యాలయంలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ శుక్రవారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యను కుదించే ప్రయత్నం జరుగుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందివ్వకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు డి.రాము, తిరుపతినాయుడు, సత్యనారాయణ, గంగాధరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

చీపురుపల్లి: ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను తప్పుబడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఎంఈఓ -1 పోస్టును జిల్లా పరిషత్ పంచాయతీరాజ్ యాజమాన్యం నుంచి తప్పించి ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు కట్టబెట్టడం సరికాదని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కర్లాం ప్రాథమిక పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు మెండి జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.